# అబద్ధాల ఊబిలో

చరణ్‌దాస్ నోరు ఒక్క క్షణం ఊరుకోదు. ఎప్పుడూ ఏదో ఒకటి మాట్లాడుతూనే వుంటాడు. కొన్ని విషయాలు గోరంతని కొండంతచేసి చెబుతాడు. కొన్ని విషయాలు లేనివి ఉన్నట్టు చెబుతాడు. రోజుకోసారి ఆఫీసుకి రాగానే, "ఇవ్వాళ మన డైరెక్టరుగారు మారిపోతున్నారోయ్. కొత్తాయన వస్తున్నాట్ట" అంటాడు. ఒక్కోసారి ఫలానా అతను ఒస్తున్నాడని పేరుకూడా చెప్పేస్తాడు. ఆ వార్త క్షణంలో దావానంలా అంటుకుపోయి ఆఫీసంతా మారుమోగిపోతుంది. ఆ పేరునిబట్టి ఎవరు అతనికి ఎంతక్లోజో, ఎవరు ఆ కులానికి చెందినవారో, వాళ్ళందరి పుట్టుపూర్వోత్తరాలతో సహా చర్చలు జరిగిపోతాయి. ఆ తరువాత, కొన్నాళ్ళు సైలెంటుగా జరిగిపోతుంది. మళ్ళీ ఓ వారం తరవాత మరోవార్త.

చరణ్‌దాస్‌కి ఆఫీసులోనే కాదు. ఇంట్లో వాళ్ళదగ్గరా, స్నేహితుల దగ్గరా కూడా ఇలాంటి అబద్ధాలు దొర్లిపోయి చలామణి అవుతూవుంటాయి. కొత్తలో అందరూ నమ్మేసేవారు. రాను రాను నమ్మడం మానేశారు. అయితే ఒచ్చిన చిక్కల్లా అతని అబద్ధాలు పూర్తిగా అబద్ధాలు కావు. ఉదాహరణకి అతని అక్క కొడుక్కి తొంభైతొమ్మిది డిగ్రీల జ్వరం వుందనుకోండి. చరణ్‌దాస్ నూటానాలుగుంది అంటాడు. కాబట్టి అసలు జ్వరం లేదనడానికీ వీల్లేదు. నూటానాలుగని భయపడిపన్లన్నీ ఒదిలిపెట్టి పరుగెత్తాల్సిన పనీలేదు. అందుకని చరణ్‌దాస్ ఏది చెప్పినా మరో వ్యక్తి దగ్గరి నుంచి ఆ న్యూస్ 'కన్‌ఫరమ్' చేసుకుంటే గాని నమ్మని స్థితి ఏర్పడింది. తమాషా ఏమిటంటే చరణ్‌దాస్‌కి ఆ సంగతి తెలుసు 'కానీ ఆ అలవాటు మానుకోలేక పోతున్నాడు. దానివల్ల ఒక్కొక్క సారి ఎన్నో అనర్ధాలూ, అవస్థలూ కూడా తట్టుకోవలసి వచ్చింది.

ఒకసారి బస్సులో ప్రయాణం చేస్తున్నాడు జీతాలందుకున్న రోజున! బస్సు దిగి ఇంటికొచ్చి జేబులు చూసుకుంటే పర్సులేదు. బస్సులో పర్సు పోయిందని భార్యామణికి చెప్పేస్తే, అతను చరణ్‌దాస్ ఎలా అవుతాడు? ఆమె కేకలేస్తుందేమోనన్న భయానికి, అత్యంత ఆపదలో చిక్కుకున్న తన కొలీగ్

భార్య ప్రాణాలని కాపాడ్డంకోసం అప్పుగా ఇచ్చానని చెప్పాడు తన జీతాన్ని 'అయ్యో పాపం!' అన్నా భార్యామణి నాల్నెల్లుపోయాక సాధించడం మొదలెట్టింది. ఎవరికిచ్చారో ఊరూపేరూ చెప్పమంది.

వెంటనే ఏం చెప్పాలో తెలీక తన కొలీగ్ చంద్రశేఖర్ పేరు చెప్పాడు. రోజుకోసారయినా ఆ చంద్రశేఖర్ పేరుమీద దండకం చదివేస్తోంది శ్రీమతి చరణ్‌దాస్!

ఓసారి ఏదోపనిమీద చంద్రశేఖర్ చరణ్‌దాస్ ఇంటికొచ్చాడు. అప్పుడు చరణ్‌దాస్ ఇంట్లో లేడు. చంద్రశేఖర్ పేరు వినగానే, అరికాలి మంట నెత్తికెక్కింది శ్రీమతి చరణ్‌దాస్‌కి "ఏమండీ? అవసరానికి అప్పుతీసుకోవడం తెలుసుగానీ, తిరిగి ఇవ్వడం తెలీదా?" అంటూ ఏదేదో మాట్లాడింది. చంద్రశేఖరం తెల్లమొహంవేసి బయటపడ్డాడు. కొలీగ్ దగ్గర పరువుపోయినందుకు చరణ్‌దాస్ బాధపడ్డా, కనీసం భార్యామణి ముందు మాట నిలబెట్టుకోవడం కోసం మరో ఫ్రెండు కృష్ణమాచారి దగ్గర వడ్డీకి డబ్బుతీసుకుని భార్యామణి కిచ్చాడు. చంద్రశేఖర్ అప్పుతీర్చేశాడని తన వాగ్దాటికి మురిసిపోతూ, ఆ డబ్బుతో పట్టు చీరకొనుక్కుంది శ్రీమతి చరణ్‌దాస్!

అసలూ వడ్డీ కలిసి లప్పెడంతయింది కృష్ణమాచారి దగ్గర. ఒకరోజున అతను చరణ్‌దాస్‌ని నడిరోడ్డుమీద పట్టుకుని, చొక్కా ఊడదీసినంత పనిచేశాడు. చావుతిట్లుతిని కొంపచేరుకున్న చరణ్‌దాస్ చేసేదిలేక పెళ్ళాం బాగా నిద్రలో మునిగున్న సమయంలో దుప్పటి ముసుగేసుకుని, మెళ్ళోని మంగళసూత్రాల గొలుసు కత్తిరించి తీసికెళ్ళిపోయి జేబులో వేసుకుని అలికిడికి కన్నుతెరిచిన భార్యామణిని చూసి "దొంగ. . . దొంగ. . ." అని అరిచాడు. ఆ అరుపులకి ఇరుగుపొరుగంతా మూగారు. కాస్సేపటికి తన బోసిమెడ చూసుకుంటూ "నా గొలుసు. నా మంగళసూత్రాలు" లబోదిబో నెత్తీనోరూ కొట్టుకుంది శ్రీమతి చరణ్‌దాస్.

పోలీస్ రిపోర్టివ్వమన్నారు అందరూ "ఆ... పోలీసులేం చేస్తారు దండగ. వాళ్ళచుట్టూ తిరగలేక చావాలి" అన్నాడు చరణ్‌దాస్! "ఇవ్వాళ మీ ఇంట్లో

అయింది. రేపు మా ఇంట్లో అవుతుంది. పోలీస్ రిపోర్టివ్వడమే మంచిది" అన్నారు ఇరుగుపొరుగులు. అనడమేమిటి వెళ్ళి పోలీసులని పిల్చుకొచ్చారు కూడా!

మన సినిమాల్లో పోలీసులని జోకర్లలాగా చూడ్డానికి అలవాటు పడ్డ జనం, పోలీసుల మీద అలాంటి అభిప్రాయాలనే పెంచుకోవడంచేత, చరణ్ దాస్ కూడా ఆ విషయం పెద్దగా పట్టించుకోలేదు.

కానీ ఈ పోలీసులు జోకర్లలా కాక నిజంగానే రంగంలోకి దిగి అసలు దొంగని పట్టేశారు. ఆ గొలుసు అమ్ముతూన్న వాళ్ళనీ, కొంటూన్న వాళ్ళనీ సాక్ష్యాలతో సహా తెచ్చేసరికి దాని మూలం చరణ్ దాస్ దగ్గర దొరికింది. దాంతో అతని చేతులకి బేడీలు పడ్డాయి!

చరణ్ దాస్ భార్యనీ, కొడుకునీ మేనమామ తీసికెళ్ళాడు.

ఆరోజు సాయంత్రం ఆఫీసునుంచొస్తూ వారి మాటలు విని ఆగిపోయాడు చరణ్ దాస్ బావమర్ది శేషాచలం. తనకొడుకు చింటూతో చెబుతున్నాడు చరణ్ దాస్ కొడుకు రాందాసు. "ఒకసారి జైలుకెళ్ళితే చాలు మంత్రై పోవచ్చుట. కనీసం ఎమ్.ఎల్.ఏ అయినా అయిపోవచ్చుట. జైలునుంచి రాగానే మా నాన్న అదే చేస్తాట్ట. మా అమ్మ చెప్పింది".

శేషాచలం మనసు చివుక్కుమంది. చెల్లెల్ని పిలిచి పిల్లలకి అబద్ధాలు నేర్పించకమ్మా. ఒకసారి ఆ ఊబిలో చిక్కుకుంటే బయటపడ్డం కష్టం. 'ప్రాణమాన భంగమందు, బొంకవచ్చునరుడు' అని ఏదో అటువంటి ప్రాణంమీది కొచ్చిన సమయంలో ఎవరికీ హాని చెయ్యని అబద్ధం ఒకటి చెబితే తప్పులేదు కానీ, ప్రతి చిన్న విషయానికి అబద్ధం చెప్పడం మొదలెడితే, అది అలవాటయిపోయి "నాన్నా పులి" కథలాగా నిజం చెప్పినా ఎవరూ నమ్మరు. అప్పుడు అనర్థాలు జరిగిపోతాయి".

అందమైన అబద్ధంతో తాత్కాలికమైన తియ్యని ప్రపంచాన్ని చూడ్డం కన్నా, కఠోరమైనదైనా నిజాన్ని చెప్పి ఒప్పించి, మెప్పించి, జీవన మార్గాన్ని బోధించడం మనధర్మం' అన్నారు ప్రాధేయపడుతూ! ★